
# డ్రీమ్ గర్ల్

గంటి లలిత

'ఏం వ్రాయను.. కుశల సమాచారాలు రాయడానికి మన మధ్య బంధుత్వం లేదు. ఫ్రెండ్స్ సర్కిల్ అంతకన్నా కాదు. మనసుని మధించి మేథకి పదును పెట్టి గుండె తలుపులని తట్టి తీసేట్లుగా రాయగలిగే శక్తి నాకు లేదు.



నాగరికత కొండచిలువలా పాకి సాంప్రదాయాలని మింగి వేస్తున్న ప్రదేశాల ఛాయ కూడా పడని మారుమూల పల్లెలో చిరు దీపపు కాంతిలో మబ్బులు మసకబారిన చిరువెన్నెల కాంతిలో పొన్నపొగడ పారిజాత సువాసనలని గాలి అలలు అలలు అలలుగా మోసుకొచ్చి చూడవోయ్ అని ఎంతో ప్రేమగా స్పందిస్తూ పలకరిస్తున్న వేళ మీకు ఈ ఉత్తరాన్ని రాస్తూ మీ పరిచయాన్ని పెంచుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది ఈ మనసు. ఎన్నో రాయాలని మనసున కదిలే భావాలని కాగితం మీద పెట్టగలిగే శక్తి లేదు సుమా మీలా!'

'ఉత్తరాన్ని పెదాలకి అన్చుకుని గుండెల్లో దాచుకోవాలనే అనుభూతి కలిగాలిట ఉత్తరాన్ని అందుకోగానే. నిజం కదూ. ఇంక అసలు విషయానికి వస్తే మీరు ఎంత బాగా రాస్తారో. మీ నవలలు ఫెంటాస్టిక్. మీరు నెంబర్ వన్ రైటర్. నిజం అని మిమ్మల్ని తెగ పొగిడేస్తూ మీ పరిచయం పెంచుకోవాలని కాదు నేను మీకు ఉత్తరం రాయడం. క్షమించండి. అలా రాయలేను. పాఠకులకి ఉపయోగ పడేలా సామాజిక స్పృహ కలిగిన రచనలు ఎన్నిరాశారు. ఒకసారి మీలో మీరు తర్కించుకున్నారా. నేను ఎందుకు ఎవరి కోసం రాస్తున్నాను. ఏ సందేశం పాఠకులకు అందిస్తున్నాను. నా రచనవల్ల ఎవరికైనా ఏదైనా ఉపయోగం జరిగిందా అని. అన్నీ ఒకే తరహా నవలలు. అందమైన హీరోలు (ఆరు అడుగుల ఆజానుబాహువు. ఏడు అడుగులు అంటే బాగుండదేమో) అందమైన హీరోయిన్స్, ద్వేషం, పగా, ప్రేమా పెళ్లి ఇవేగా. కాసింత భావుకత్వం. ఇదే నా. మంచి నవలలు అంటే ఇవి కాదండీ. మీ రచనలు (మీరు కూడా కన్నెపిల్లల మనసుల్లో దోబూచులాడుతూ ఊహల్లో విహరింపచేస్తే చాలనుకుంటున్నారేమో. క్షమించండి ఇలా రాస్తున్నందుకు. మీరు అనుకోవాలే కానీ మీకు మంచి థీమ్ దొరకదా! ఇది సద్విమర్శగా తీసుకుంటారు కదూ'

'ఉత్తరాన్ని పెదాలకి అన్చుకుని గుండెల్లో దాచుకోవాలనే అనుభూతి కలిగాలిట ఉత్తరాన్ని అందుకోగానే. నిజం కదూ. ఇంక అసలు విషయానికి వస్తే మీరు ఎంత బాగా రాస్తారో. మీ నవలలు ఫెంటాస్టిక్. మీరు నెంబర్ వన్ రైటర్.

'అన్నట్లు మీకు ముక్కుమీద కోపమట కదా. నాకు ఆ పాట గుర్తుకు వస్తోంది. ముక్కుమీద కోపం నీ ముఖానికే అందం. మీరు కోపంలో మరీ అందంగా వుంటారండీ. అందుకేనేమో కోపం. నా సాహసాన్ని మన్నిస్తారు కదూ. 'పేరులోనేముంది'

'మరి వుంటా'

ఫ్రమ్ అడ్రస్ లేదు. ఊరూ పేరూ లేని ఆ ఉత్తరాన్ని విసుగ్గా పక్కన పడేశాడు. ఆ ఉత్తరం అందించిన సువాసన మనసుని క్షణం మరపింపచేసింది.

'హలో'

'ఎలా వున్నారు? ఈ నా రెండో ఉత్తరాన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారో మరి. ఎప్పుడూ సీరియస్‌గా వుంటారెందుకు? సీరియస్ ఫేస్ ఈజ్ సీక్రెట్ లవ్‌ట. భగ్నప్రేమికులా మీరు. అయినా మీకు అంత తీరిక ఎక్కడిది. మీ పనులన్నింటికీ మీరు మీ పర్సనల్ సెక్రటరీ మీద ఆధారపడతారట కదా. మరి ఈ పని (అంటే ప్రేమించడం) కూడా అతడికే అప్పగిస్తారా. కాస్త ప్రేమించిపెట్టు, నాకు తీరిక లేదు అని చెప్తారేమో. నవ్వుతున్నాను. మీకూ వస్తోంది కదూ. ఏదో రాయాలని మరేదో రాస్తున్నాను. కొత్త నవల మొదలు పెట్టారా. ఈగ ఇల్లు అలుకుతూ పేరు మరచిపోయిందిట. మీ ధ్యాసలో నన్ను నేనే మరచిపోతున్నాను. ఈసారికి ఇంతటితో విరమిస్తున్నాను. సెలవా మరి. మరో ఉత్తరం కోసం ఎదురుచూడండి. 'వుంటా'.

సువాసనలని అందించే ఆ ఉత్తరంలో ఈసారి కూడా ఊరూ పేరూ లేదు. ' ఏం అభిమానులో' విసుగుతో పక్కన పడేసాడు. వద్దు అనుకుంటూనే మూడో ఉత్తరం కోసం ఎదురు చూడసాగాడు.

'డియర్ చంద్రహాసా!

ముచ్చటగా ఇది మూడో ఉత్తరం. నా ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నారంటే నాకు ఎంత ఆనందం. ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. మీ పేరుకి సరిపోయేలా వున్నారు మీరు. నిజం అండీ. అపురూపమైన మీ నవ్వు సూర్యకాంతితో తళుకులీనే వజ్రపు మెరుపులకి సమానమని చెప్పనా. అపురూపంగా లభించేవి అపురూపంగానే వుంటాయిట. అయినా కృష్ణదేవరాయలు, విక్రమార్కుడు, చంద్రహాసుడూ ఈ పేర్లేమిటి బాబూ. పిలవాలంటే నోరు తిరగదు. అధునాతనమైన పేర్లు ఎన్నో వున్నాయిగా. అదిగో మీకు మళ్లీ కోపం వస్తోంది కదూ. అబ్బ ఊరికే అన్నాను హాస్యానికి. నిజం అనుకోకండి. ఒట్టు. మీ పేరూ, మీరూ నచ్చారండీ నాకు. సరే. కొన్ని కొన్ని పనులు కొందరే చేయాలి. అదే అందం. ఆనందం కూడా. అన్నింటికీ మీ పర్సనల్ అసిస్టెంట్ మీద ఆధారపడకూడదు. బాగోదు. అభిమానులు వాళ్ళ అభిమాన అనురాగాలతోరాసిన ఉత్తరాలు అతడు చదవడం.. ప్చ్... బాగో లేదండీ. మీరే స్వయంగా చదివితే ఆ అభిమానుల గుండె తడి మీ గుండె తలుపులని తట్టి లేపదూ. ఆ అనురాగానికి తడిసిన మీ కళ్ళు చెమర్చవూ. ఇకనైనా ఉత్తరాలని మీరే చదువుకోండి. కొన్ని కొన్ని పనులు కొందరికే పరిమితం. ఒత్తైన మీ ఉంగరాల జుట్టు అసలు వొంగదు. మీ అసిస్టెంట్ చేత తల దువ్వించుకోవడం.. ప్చ్... అసలు ఆ భావనే బాగోలేదు కదా. అందమైన ఆడపిల్ల కొంగు దోపుకుని దువ్వెన చేతబట్టుకుని మీకు పాపిడి తీస్తూ తల దువ్వుతూ అంతలోనే చెరపివేస్తూ అల్లరిగా నవ్వుతూ మీ తలని తన ఎదమీదకి లాక్కొని మీ కళ్లల్లోకి చూస్తూ గారాలు పోతూ అల్లరిచేస్తూ.. ఒహ్... మీరు ఊహించుకోండి. ఎంత చక్కని మధుర భావన. సో అర్థం అయిందనే అనుకుంటున్నాను. నాకో అనుమానం, నా ఉత్తరాలు కూడా అతగాడే చదువుతున్నాడేమో అని. జాగ్రత్త సుమా! ఇక మీదట ఏ ఉత్తరాలు అయినా మీరే చదువుకోండి. ఇంక రాయనమ్మా!'

సెలవు.

మనసు బాధగా మూలిగింది. 'ఎవరీ అల్లరి పిల్ల. ఎందుకు ఇలా వెంబడిస్తోంది. పేరు లేదు అడ్రస్ లేదు' నిట్టూర్చాడు.

అద్దంలో ప్రతిబింబం వెక్కిరిస్తోంది. అందమైన ఆడపిల్ల. బాపూగారి బొమ్మ నీళ్ళలో చెదిరిన బింబంలా అస్పష్టమైన రూపం చేతిలో దువ్వెనతో కవ్విస్తూ తన తలని ఆమె తన ఎత్తైన ఎద మీదకి లాక్కుని అల్లరిగా నవ్వుతూంటే ఆ ఎదలో తను తలదాచుకుంటున్న అనుభూతి. ఎంత చక్కటి ఊహ. అతడి పెదాల అందంగా విచ్చుకున్నాయి. షరా మామూలే. మరో ఉత్తరం కోసం ఎదురు చూడటం.

'హాయ్ బుజ్జీ!

ఈ మధ్య కాస్త చిక్కినట్లున్నారు. నా వలన కదూ. సారీ. నా ఉత్తరాలు నిన్నంతగా బాధపెడుతున్నాయా, త్వరలోనే మంచి పోషక ఆహారాలతో మిమ్మల్ని మళ్ళీ మామూలు మనిషిని చేస్తాను. నిజం రుచులు రుచులుగా వండి పెడతాను. సరేనా బామ్మ అంటోంది. ఎవరికీ అలా పరాయి మగవాడికి ఉత్తరం రాస్తూ నీలో నువ్వే నవ్వుకుంటున్నావు అని. మీరు నాకు పరాయివారు ఎలా అవుతారు. బామ్మ అంతులేని అనురాగంలో పెరిగిన నేను నా గురించి ఏం వ్రాయను'

'బామ్మా రేపు నేను పెళ్ళిచేసుకుని అత్త వారింటికి వెళ్ళిపోతే' అల్లరిగా నవ్వుతూ నేను..

'నేను లేకుండా నువ్వు ఎక్కడికి వెడతావు. నిన్ను వదలి నేను ఎలా వుండగలను? ఆ గుండెల్లో దిగులుని మాటల్లో స్పష్టం చేస్తూ బామ్మ దిగులుగా చూస్తూ–

'బామ్మా! నేను ప్రక్కన లేకపోతే నిద్రకూడా పట్టదంటావు. నా ప్రక్క వదలవు. మరి రేపు' నాలో ఏ మూలో కొంటెదనం.

'నిజం సుమా! నా స్థలాన్ని ఎవరికీ ఇవ్వను. ఆ కాస్సేపూ ఏ మూలో గడిపేస్తాను. ఆ తర్వాత అతగాడు అంటే నీ మొగుడు ఒక ప్రక్కన నేను మరో వైపు మధ్యలో నలుగుతూ నువ్వు అదీ కాదంటే నేను ఏం చూడను. కళ్ళు మూసుకుని మరొక వైపు తిరిగి పడుకుంటాను. అడ్జస్ట్ అయిపో బాబూ అని బ్రతిమిలాడుకుంటాను' బామ్మ బోసినోటితో నవ్వుతుంటే ఆ నవ్వుతో శృతి కలుపుతూ నేను హాయిగా మనసారా నవ్వేసాను. నవ్వలేక పొట్ట పట్టుకున్నాను. మరి బామ్మతో అడ్జస్ట్ అవగలరా!'

'ఊసులాటకి ఉబుసుపోక మొదలు పెట్టిన ఉత్తరాలు కావు ఇవి. ఈ ప్రేమ అనే ఊబిలో ఎంతగా కూరుకుపోయానో చూసారా?'

'మిత్రమా! చెట్టు చెట్టు దగ్గరికీ వెళ్లి పువ్వు పువ్వునీ అడిగి పుప్పొడిని సేకరించి నీదారిన పరచి నిన్ను ఆహ్వానిస్తూ జాలువారుతున్న వెన్నెలని దోసిటపట్టి నీ కాళ్ళని కడగాలని వుంది. ఈ ప్రేమ ఎంత పిచ్చిది. క్షమించు ప్రియతమా. నీ మనసుని తెలుసుకోకుండా నా ప్రేమని నా మనసుని అద్దం పట్టి నీ ముందుంచినందుకు..

'ప్రేమతో నీ చెలి'

అతడి మనసు ఉద్రేకమో, ఉద్వేగమో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడింది. 'మనసుని మధురంగా మీటి ప్రేమని పెంచి నా జీవితంతో దోబూచులాడుతూ ఎందుకిలా బాధపెడుతున్నావు. అసలు నువ్వు ఎవరు?' నిట్టూరుస్తూ ఆ ఉత్తరాన్ని మరో సారి చదువుతున్నాడు.

బామ్మ ఒక ప్రక్కనా మరొక ప్రక్కన తను. మధ్యలో అందమైన అమ్మాయి. కళ్ళముందు కదిలింది ఆ దృశ్యం. 'బాబోయ్ బామ్మ' గట్టిగా నవ్వేశాడు.

'కన్నా!'

'దోబూచులాడుతున్నానని తిట్టుకుంటున్నారా! క్షమించండి. ఈ క్షణం మీ సమక్షంలో వాలాలని రేగిన జుట్టుని చెరిపివేస్తూ కోపంతో కందిన మీ ముక్కుని పట్టుకుని ఊపేస్తూ అల్లరి చేయాలనే ఉద్రేకం. ఏదీ చేయలేని అశక్తత. రాత్రి చక్కని కల గన్నాను. అందంగా పరుగులు తీసే మబ్బుల మెట్లని అలవోకగా ఎక్కుతూ ఇంద్రధనుస్సుని తాళ్ళగా, నెలవంకని ఊయల చేసి ఊయల ఊగుతూ మీరు చేతిని అందించగా మీ చేతిని అందుకున్న నేను మీ గుండెలమీద తలవాల్చాను. మీరు నా చెవిలో మూసుకున్న నీ కనురెప్పల మీద హాయిగా విశ్రమించనీయవూ అని గుస గుస లాడుతూ నవ్వుతున్నారు. మనమీద నక్షత్ర సుమాలు రాలుతుంటే... నా పెదవుల మీద మీరు చెరగని ముద్ర వేస్తుంటే మేఘ మండలం, నక్షత్ర మండలం దాటుతుంటే మీరు గట్టిగా ఊగుతుంటే ఇక ఊపకండి. నాకు భయం వేస్తోంది అని నేను అరుస్తూ మిమ్మల్ని మరింత గట్టిగా అల్లుకు పోయాను. అంతే ధఢాలున క్రిందపడ్డాను. బామ్మ కేకలు, జరిగింది అర్థమై తెరలు తెరలుగా నవ్వుతున్న నన్ను చూస్తూ బామ్మ ఒకటే గొడవ' పిల్లకి ఏ గాలీ, ధూళీ సోకిందో ఈ మధ్య పిల్ల ఇలా అయిపోతోంది. ఈ పిచ్చినవ్వు ఏవిటో అని'

'బామ్మకి మీ గురించీ, కల గురించి ఎలా చెప్పను? అన్నీ చదివి వినిపించినట్లే ఈ ఉత్తరాలు కూడా చదివి వినిపించమని బామ్మ ఒకటే గొడవ. నా వెనకాలే నిల్చుని చదవడానికి ప్రయత్నిస్తోంది. సో బెస్టాఫ్ లక్ మరి'

ఆ ఉత్తరం అతడికి జపమాలే అయింది. ఆమె ధ్యాసలో అతడు పిచ్చివాడే అవుతున్నాడు.

''హాయ్ మూన్ లాఫ్''

'మీ పేరుకి అర్థం అదేగా. కన్నా నా గురించి ఏం వ్రాయను? ఏ ప్రత్యేకతా లేని గడ్డిపువ్వుని. ఐదో క్లాసులో అల్లరి చేసి మాస్టారి చేత దెబ్బలు తిని బామ్మకి చెబితే బామ్మ స్కూల్ మానిపించింది. మొగుడికి ఉత్తరం రాయడం వస్తే చాలు, ఇక చదువెందుకు అని. ఇంక నా కార్యక్రమం ఉదయాన్నే లేవడం. బామ్మ కాఫీ తాగనివ్వదు. సోలడు పాలు కంచు గ్లాసులో పోసి ఇస్తుంది. మాట్లాడకుండా తాగాలి. ఏడున్నరకి పట్టెడు ఆవకాయ, గరిటెడు నూనెతో చద్దన్నం అంటే తరవాణీ అన్నం తినడం. ఆ తర్వాత పూల మొక్కల మధ్య మీ నవలలతో కాలక్షేపం. పదకొండు పన్నెండు మధ్య రెండు కూరలు పప్పు పులుసూ వేడి వేడి అన్నం మీద దాడి చేయడం. మధ్యాహ్నం నిద్ర. చిరుతిండి మళ్ళీ రాత్రి షరామామూలే. ఇదండీ నా దినచర్య. క్షమించండి. ఇదే ఆఖరి ఉత్తరం అనుకుంటాను. ఇంక నా పేరు ఎందుకు? ఇలా మిగిలిపోనా?'

ప్రేమ అని కవ్వించి నా జీవితంలో ఎందుకు ఆడుకున్నావు. నిట్టూర్చాడు.

బాబూ,

రేపు పదమూడున నేనూ అమ్మాయి బయల్దేరి వస్తున్నాం. నీకు ఈ విషయం చెప్పకూడదుట. అంతటి మహా నగరంలో నువ్వు రాకపోతే ఆడ వాళ్ళం అడ్రస్ పట్టుకోవడం కష్టం అని రాస్తున్నాను. మా పిల్ల లక్ష్మీ సరస్వతుల కలయిక ఎంత అందంగా వుంటుందో తెలుసా. నువ్వే వస్తావుగా. దానికి తెలియకుండా ఫొటోలు పంపుతున్నాను. చూడు నా బంగారాన్ని అదృష్టవంతుడివి నువ్వా. మా అమ్మాయా! తప్పకుండా స్టేషన్‌కి వస్తావు కదూ. వుంటా'

'బామ్మ'

వ్వె...వ్వే...వ్వె...ఫొటోలని దాచేసాను. బామ్మకి తెలియదు సారీ...

తిరిగి తిరిగి వచ్చింది ఉత్తరం. అంటే పదమూడున రైలుదిగిన వాళ్ళు ఏమైపోయారు. ఎక్కడని వెదకను నీ కోసం. ఒక్కసారి రావూ నాకోసం. చెప్పవా నేస్తం నీ ప్రేమ చిరునామా. ఎక్కడున్నా నీ కోసం వస్తాను. కన్నీళ్ళతో సముద్రపు ఒడ్డున కూర్చుని గంటల తరబడి శూన్యంలోకి చూస్తూ ఒంటరిగా మిగిలిపోయాడు. ★

## పాటల ప్రతీచి

ఈ అమ్మాయి పేరు ప్రతీచి మహాపాత్ర. సికింద్రాబాద్‌లో చదువుకుంది. చదువుకునే రోజుల నుంచి పాటల కోయిల. ఆడపిల్లల సంగీత బృందం 'వివ'లో ఈమె సభ్యురాలు. ఈ బృందం రెండు ఆల్బమ్స్ విడుదల చేసింది. తరువాత ఎవరికి వారికి వ్యక్తిగత అవకాశాలు రావడంతో ఈ బృందం విడిపోయింది. ప్రతీచి టైమ్స్ మ్యూజిక్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకుని సోనీ ఎరిక్‌సన్, ఫెయిర్ అండ్ లవ్లీ తరపున దేశమంతా పర్యటించింది. ఒకటి రెండు హిందీ సినిమాల్లో పాటలు పాడిన ప్రతీచి సొంతంగా 'భోర్' అనే ఆల్బం విడుదల చేసింది. దానికి మంచి రెస్పాన్సే వచ్చింది.

